కులగణనపై కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేయాలి

లిబర్టీ: కులగణన చేయకుండా కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం బీసీలకు తీరని అన్యాయం చేస్తుందని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి అన్నారు. పదేళ్ల కాలంలో అన్ని రంగాల్లో బీసీలకు అన్యాయం చేసిన బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం మోసపూరిత పరిపాలన చేస్తుందని ధ్వజమెత్తారు. సోమవారం దళ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులగణన చేయాలని నిర్ణయించిందని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరహాలోని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఇప్పటికైనా బీసీల పట్ల అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని విడనాడి కులగణన చేస్తామని అధికారికంగా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు, కార్యకర్తలున్నారు.

పద్యపౌరాణిక నాటక సాహిత్యం మన సంపద

ప్రముఖ సాహితీవేత్త డా. ఎంకే రాము

చిక్కడపల్లి: పద్యపౌరాణిక నాటక సాహిత్యం తెలుగు భాషా సంపద అని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఎం.కె.రాము అన్నారు. సోమవారం రాత్రి చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో పద్య నాటకోత్సవం సోమవారం రాత్రి ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంకె రాము మాట్లాడుతూ... ఈ సంపదను పరిరక్షించుకుని ముందు తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యువ కళావాహిని అధ్యక్షులు లంక లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించగా వేదికపై కళా పోషకులు వీరభోగ వసంత రాయలు, ఉమర్‌ఖాన్ అలీ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన నవీన్‌యాదవ్

వెంగళరావునగర్: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు వి.నవీన్‌యాదవ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తొలుత ఆయనకు పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సీఎంకు పూలమొక్కను అందజేశారు.

వ్యభిచార గృహంపై దాడి

వెంగళరావునగర్: వ్యభిచార గృహంపై దాడి చేసి నిర్వాహకులతో పాటు ఓ మహిళను అదుపులోకి తీసుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... రహమత్‌నగర్‌లోని ఓ గృహంలో వ్యభిచారం జరుగుతున్నట్టుగా మధురానగర్ పీఎస్‌కు సమాచారం వచ్చింది. దీంతో ఎస్‌ఐ అవినాష్ తన సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. అక్కడ నిర్వాహకులు వంశీ, అతని భార్య ఉన్నారు. వారితో పాటుగా వైజాగ్‌కు చెందిన మహిళ కూడా ఉంది. నిర్వాహకులను పోలీసులు ప్రశ్నించగా వైజాగ్‌కు చెందిన మహిళతో వ్యభిచారం చేయిస్తున్నట్టుగా అంగీకరించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న కండోమ్స్, ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫోన్ లాక్కుని పరారీ

వెంగళరావునగర్: రోడ్డుమీద నడుచుకుంటూ వెళుతున్న యువకుడి ఫోన్ లాక్కుని వెళ్లిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కూకట్‌పల్లికి చెందిన సాయికృష్ణ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి తన కారును మైత్రీవనం సమీపంలో ఆపి కూకట్‌పల్లి వెళ్ళడానికి బస్సు కోసం రోడ్డుమీద నడుచుకుంటూ వెళుతున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని యువకుడు ద్విచక్ర వాహనంపై వెనుక నుంచి వచ్చి సాయికృష్ణ చేతిలోని ఫోన్ లాక్కుని పారిపోయాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

వెంగళరావునగర్ : రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. సనత్‌నగర్‌కు చెందిన ఎం. సుభాష్ ఆదివారం మాదాపూర్ నుంచి సనత్‌నగర్ ద్విచక్ర వాహనంపై వేగంగా వెళుతున్నాడు. మధురా వైన్స్ వద్దకు రాగానే ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిపోయాడు. దీంతో అతనికి గాయాలయ్యాయి. అక్కడే ఉన్న సాయిదుర్గ ప్రసాద్ పోలీసులకు సమాచారం ఇవ్వగా మధురానగర్ పోలీసులు క్షతగాత్రుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో ఇద్దరికి..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ప్రకాశం జిల్లాకు చెందిన చైతన్య ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ పార్ట్ టైం ర్యాపిడో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం దేవి అనే మహిళను కల్వరి టెంపుల్ నుంచి మధురానగర్ తీసుకెళుతున్నాడు. ఈ క్రమంలో మైత్రీవనం సమీపంలోకి రాగానే సంతోష్‌కుమార్ వేగంగా తన ద్విచక్ర వాహనంపై వచ్చి ర్యాపిడోను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనలో మహిళతో పాటు, చైతన్యకు గాయాలయ్యాయి. బాధితులు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.



నిర్మాణం పనులు నిలిపివేసిన అడ్డగుట్ట కమ్యూనిటీహాళ్లు



పునాది నిర్మాణానికే పరిమితమైన సీతాఫల్‌మండి విద్యా సంస్థల భవనం

‘అభివృద్ధి’పై నీలినీడలు

ముందుకు సాగని రూ.100కోట్ల పనులు

- విద్యార్థులు, రోగులకు ఇబ్బందులు
- మూలనపడ్డ వంతెనల నిర్మాణం
- లష్కర్ ప్రజల్లో నిరాశ, నిస్పృహ



లాలాపేటలో అర్ధతరంగా నిలిచిపోయిన స్విమ్మింగ్‌పూల్ నిర్మాణం

అర్ధంతరంగా నిలిచినవి

- రూ.12 కోట్ల వ్యయంతో సీతాఫల్‌మండి కుట్టివెల్లోడి ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం.
- రూ.29.75 కోట్ల వ్యయంతో సీతాఫల్‌మండి హైస్కూల్, కళాశాలల భవన సముదాయం.
- రూ.6కోట్లతో లాలాపేట స్విమ్మింగ్‌పూల్.
- రూ.3 కోట్లతో అడ్డగుట్ట, లాలాపేట మల్టీపర్పస్ కమ్యూనిటీహాళ్ళు.

ప్రతిపాదించినవి

- రూ.30 కోట్లతో మెట్టుగూడ–చిలకలగూడ రైల్వే వంతెన
- రూ.20 కోట్లతో సీతాఫల్‌మండి–మాణిక్యేశ్వర్‌నగర్

అభివృద్ధి పనులన్నీ పూర్తి చేస్తాం

నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులన్నీ పూర్తిచేస్తాం. ప్రభుత్వ మారినంత మాత్రాన అభివృద్ధి పనులను వదిలేది లేదు. ఇక్కడి ప్రజల అవసరాలను, గత ప్రభుత్వంలో చేపట్టిన, ప్రతిపాదించిన అభివృద్ధి పనులను ప్రభుత్వం దష్టికి తీసుకెళుతాం. కొంతమేర జాప్యం జరిగినప్పటికీ నిర్మాణం పనులు ప్రారంభమైన, ప్రతిపాదించిన పనులను పూర్తిచేయిస్తాం.

టి. పద్మారావుగౌడ్, ఎమ్మెల్యే సికింద్రాబాద్



సికింద్రాబాద్: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉరుకులు పరుగుల దిశగా ప్రారంభమైన భారీ అభివృద్ధి పనులు శాసనసభ ఎన్నికల అనంతరం ఒక్కసారిగా ఆగిపోయాయి. బీఆర్ఎస్ అధికారం కోల్పోయి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సికింద్రాబాద్ నియోజకవర్గంలో సుమారు రూ.100 కోట్ల అభివృద్ధి పనులపై నీలినీడలు అలముకున్నాయి. ప్రారంభమైన భారీ అభివృద్ధి పనులు అర్ధంతరంగా నిలిచిపోగా, నిధులు మంజూరై ఉన్న పనుల గురించి పట్టించుకునే వారే కరువయ్యారు.

- సికింద్రాబాద్ నుంచి వరుసగా మూడు మార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒకమారు రాష్ట్ర కేబినెట్ మంత్రిగా, మరోమారు శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా కొనసాగారు. ప్రభుత్వంలో తనకున్న పలుకుబడితో రూ.100 కోట్లమేర అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించారు. ఇందులో కొన్ని అర్థాంతరంగా ఆగిపోయి, మరికొన్ని ప్రారంభించక ప్రశ్నార్థకంగా మారిపోయాయి.

సన్నగిల్లుతున్న ఆశలు...

ఇటీవలి శాసనసభ ఎన్నికలకు ముందు ఇక్కడ చేపట్టిన అభివృద్ధి పనులన్నీ అర్థాంతరంగా నిలిచిపోయాయి. ఏడాదికి దగ్గర కాలం గడిచిపోయినా ఆగిన అభివృద్ధి పనులు నేటికీ పునఃప్రారంభం కాలేదు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో సదరు అభివృద్ధి పనులకు సంబంధించి ప్రజల్లో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. హైస్కూలు, జూనియర్, డిగ్రీ కళాశాల, ఆసుపత్రులు, మల్టీపర్పస్ ఫంక్షన్‌హాళ్లకు అధునాతన భవనాలు వస్తాయని, స్విమ్మింగ్‌పూల్ అందుబాటులోకి వస్తుందని, వంతెనల నిర్మాణంతో ప్రయాణ సమస్యలకు తెరపడుతుందని హర్షించిన లష్కర్ ప్రజల్లో క్రమేణా నిరాశ, నిస్పృహలు అలముకుంటున్నాయి.

జాప్యంతో ఇబ్బందులు..

ఎంతోమంది పేదలకు పెద్దిక్కుగా ఉన్న సీతాఫల్‌మండి ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం అర్థాంతరంగా నిలిచిపోవడంతో రోగులు అవస్థలపాలవుతున్నారు. ఇక్కడి పురాతన భవనం కూల్చివేయడంతో వైద్యసేవలు చెల్లాచెదురయ్యాయి. వివిధ ప్రాంతాలకు తరలించిన వైద్య సేవలు పొందడం కోసం రోగులు వ్యప్రయాసలు భరించాల్సి వస్తుంది.

- విద్యా సంస్థల భవనాలదీ అదే పరిస్థితి నెలకొంది. ఇక్కడి పాత భవనాలు నేలమట్టం చేయడంతో పాఠశాలల విద్యార్థులు, జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు మూడు ప్రాంతాలకు వెళ్లాల్సి వసతుంది. అక్కడి ఇరుకు గదుల్లో ఇబ్బందుల మధ్యే బోధనలు సాగుతున్నాయి.
- వంతెనల నిర్మాణం కోసం నిధుల మంజూరు నియోజకవర్గ ప్రజల్లో కొత్త ఆశలు నింపింది. మెట్టుగూడ–చిలకలగూడ, సీతాఫల్‌మండి–మాణిక్యేశ్వరీనగర్ రైల్వే వంతెనల పనులు ప్రారంభమయ్యే అవకాశం కనిపించడం లేదు.
- అర్థాతరంగా నిలిచిపోయిన అడ్డగుట్ట, లాలాపేటలోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాళ్లు, లాలాపేట స్విమ్మింగ్‌పూల్ నిర్మాణం పనులు ప్రశ్నార్థకంగా మారాయి. పేద ప్రజల వివాహాది శుభ కార్యాలకు అందుబాటులో ఉండే ఫంక్షన్‌హాళ్లనిర్మాణం కోసం ఈ ప్రాంత ప్రజలు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటాం

ధర్మసేనా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దినకరణ్‌రెడ్డి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటామని ధర్మసేనా ఫౌండేషన్ వ్యవస్థాపకులు తలారి దినకరణ్‌రెడ్డి అన్నారు. సోమవారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దినకరణ్ మాట్లాడారు. ధర్మా ఫౌండేషన్ తరుపున ప్రజా సమస్యలపై పోరాడుతూనే ఉన్నామని అన్నారు. రాజకీయ కోణంలో కాకుండా మానవీయ కోణంలో సమస్యలపై స్పందిస్తున్నామని అన్నారు. మా సేవలను గుర్తించి మాజీ సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా అభినందించారని తెలిపారు. ప్రస్తుత రాజకీయాలపై సుదీర్ఘంగా చర్చించిన అనంతరం ఫౌండేషన్ చేస్తున్న సేవలకు ఎల్లప్పుడు అండగా ఉంటామని కేసీఆర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ముఖ్యంగా కరోనా సమయంలో ముషీరాబాద్‌లో ప్రాణాలకు తెగించి ప్రజా సేవ చేసినట్లు తెలిపారు. యువత కూడా ప్రజాసేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



దినకరణ్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్న మాజీ సీఎం కేసీఆర్

రోడ్డు పనుల పర్యవేక్షణ

కాచిగూడ: అవంతినగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు నిర్మాణపు పనులను సోమవారం హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మీ జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీసీ రోడ్డు వాటర్ క్యూరింగ్ చేపట్టాలని, మ్యాన్‌హోల్స్ లెవెల్ చూసుకోవాలని అన్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ రాము, జేపీ, రెడ్డి, శ్రీనాథ్, మహేష్ కుమార్, జగదీశ్ పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి నివారణకు!

జనవరిలోగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాల్సిందే..

- 90 రోజుల కార్యాచరణలో ఇంటింటి సర్వే
- లేకపోతే ట్యాంకర్‌కు రెట్టింపు డబ్బులు వసూలు
- ఇప్పటి వరకు ఇంకుడు గుంతలు లేని ఇళ్లు 5184
- అవగాహన కలిగిస్తున్న అధికారులు



ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తున్న జలమండలి అధికారులు



కరపత్రాలు విడుదల చేస్తున్న అధికారులు

బంజారాహిల్స్: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో భూగర్భ నీటి మట్టాలు పడిపోకుండా జలమండలి ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టింది. వచ్చే వేసవిలోనూ నీటి ఎద్దడి తలెత్తకుండా ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తోంది. ప్రతి ఇంట్లో తప్పనిసరిగా ఇంకుడుగుంత నిర్మించుకునే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. ఇందులో భాగంగానే ఈ నెల 2వ తేదీ నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు 90 రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ చేపడుతుంది. దీనిలో భాగంగా అధికారులు ఇంటింటికి తిరుగుతూ ఇంకుడు గుంతల ప్రయోజనాలను తెలియజేయడమే కాకుండా లేకపోతే నిర్మించుకునే విధంగా అవగాహన కల్పిస్తున్నారు. మరోవైపు ఇంకుడు గుంతలు లేని ఇళ్ల లెక్క తీసుకోవడానికి స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సర్వే చేపడుతున్నారు. జలమండలి డివిజన్–6 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, ఖైరతాబాద్, సోమాజీగూడ, యూసుఫ్‌గూడ, ఎర్రగడ్డ, రహమత్‌నగర్, బోరబండ, వెంగళరావునగర్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో ఇప్పటికే వాటర్‌బోర్డు పరిధిలోని రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ సెల్ ద్వారా ఎన్‌జీఓలు ఈ సర్వే పూర్తి చేశారు. డివిజన్–6 పరిధిలో 300 గజాలకు పైగా నిర్మించిన నివాసాలు, అపార్ట్‌మెంట్లలో ఇంకుడు గుంతలు ఉన్నాయో లేవో ఈ సర్వే ద్వారా నిర్ధారించారు.

- డివిజన్–6 పరిధిలో 300 గజాల పైన నివాసాలు, అపార్ట్‌మెంట్లు 7092 ఉన్నట్లుగా తేలింది. ఇందులో సోమవారం నాటికి 6937 నివాసాల సర్వే పూర్తయ్యింది.
- 5184 నివాసాలకు ఇంకుడుగుంతలు లేవని సర్వేలో తేలింది.
- మిగతా 1753 నివాసాలకు మాత్రమే ఇంకుడుగుంతలు ఉన్నట్లుగా గుర్తించారు.
- ఇంకుడుగుంతలు లేని 5184 మందికి నోటీసులు ఇచ్చి అవగాహన కల్పిస్తున్నారు.
- వీరంతా జనవరి లోగా తమ ఇళ్లల్లో లేదా అపార్ట్‌మెంట్లలో తప్పనిసరిగా ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలి. అప్పటికి కూడా ఇంకుడు గుంతలు నిర్మించుకోకపోతే వచ్చే వేసవిలో వీళ్లు ట్యాంకర్ బుక్ చేసుకుంటే రెట్టింపు డబ్బులు వసూలు చేస్తారు. ఈ విషయాలపై ఒకవైపు అవగాహన కలిగిస్తూనే ఇంకోవైపు నోటీసులు ఇచ్చే ప్రక్రియ మొదలైంది.
- గత ఏడాది నీటి ఎద్దడితో బోర్‌వెల్స్ నిండిపోయి చాలా మంది వాటర్ ట్యాంకర్లు బుక్ చేసుకున్నారు. ఈ సర్వేలో ఆ జాబితాను సిద్ధం చేసి అందులో ఇంకుడు గుంతలు లేని నివాసాలు తీసుకుని వారు వచ్చే వేసవిలో ట్యాంకర్ బుక్ చేసుకుంటే రెట్టింపు డబ్బులు వసూలు చేస్తారు.
- గత వేసవిలో ఏయే ప్రాంతాల నుంచి ట్యాంకర్లు సప్లై చేయాలని అధిక మొత్తంలో ఆర్డర్లు వచ్చాయన్నది అధికారుల దగ్గర లెక్కలు సిద్ధంగా ఉన్నాయి.
- ఆయా ప్రాంతాలతో పాటు డివిజన్ పరిధిలో రాబోయే రోజుల్లో వాటర్ ట్యాంకర్ల డిమాండ్ తగ్గించేందుకు, భూగర్భ జలాలు పెంచేందుకు స్పెషల్ డ్రైవ్ ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొంటున్నారు.
- ప్రతి ఇంట్లో ఇంకుడుగుంత నిర్మించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.
- అధికారులు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు ఇచ్చి ఇంకుడుగుంతల అవసరాన్ని అందులో వివరిస్తున్నారు.
- తాజాగా 300 గజాల స్థలంలో నిర్మించిన ప్రతి ఇంట్లో ఇంకుడుగుంత ఉండాలనే నిబంధనను తప్పకుండా అమలు చేసే దిశలో అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

ఉచితంగా సాంకేతిక సిబ్బందిని పంపిస్తాం

సీవరేజీ పైప్‌లైన్ల వ్యర్థాల తొలగింపు, ఇంటింటా ఇంకుడుగుంత నిర్మాణం థీమ్‌తో సీవరేజీ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ, భూగర్భ జలాలు పెంచడమే లక్ష్యంగా 90 రోజుల ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నాం. గాంధీ జయంతి రోజు నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు ఈ ప్రణాళిక కొనసాగిస్తాం. ఇప్పటికే మా పరిధిలో 300 గజాల పైన నివాసాల్లో ఇంకుడుగుంతలు లేని వాటిని గుర్తించడం జరిగింది. వారందరికీ అవగాహన కల్పించడంతో పాటు నోటీసులు ఇస్తున్నాం. సాంకేతిక సిబ్బందిని కూడా ఇంకుడుగుంతల మార్గదర్శకాల కోసం ఉచితంగా పంపిస్తాం. ఎవరైనా తమ ఇళ్లల్లో ఇంకుడుగుంత నిర్మించాలనుకుంటే జలమండలి గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్‌ను సంప్రదించవచ్చు. 155313కి కూడా ఫోన్ చేసి సమాచారం తీసుకోవడమే కాకుండా తమ ఇళ్లల్లో ఇంకుడుగుంతలు నిర్మించాలనుకుంటే సంప్రదించవచ్చు. భూగర్భ జలాలు తరిగిపోకుండా ఉండాలంటే ప్రతి ఇంట్లో ఇంకుడుగుంత తప్పనిసరి.

– హరిశంకర్, జలమండలి జీఎం, డివిజన్–6

నేటి నుంచి ‘యోగ వాసిష్టం’పై ప్రవచనాలు

నల్లకుంట: బాగ్‌అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ‘యోగ వాసిష్టం’పై ప్రవచనాలు ఉంటాయని సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6.30గంటలకు మహా సహస్రావధాని పద్మశ్రీ డాక్టర్ గరికిపాటి నరసింహారావు ప్రవచనాలు ఇస్తారని చెప్పారు.

ఆలయాలపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ముషీరాబాద్: హిందూ దేవాలయాలను ధ్వంసం చేస్తున్న వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రోయ్యూరు శేషసాయి డిమాండ్ చేశారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ దేవాలయంలోని అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగుడిని కఠినంగా శిక్షించాలన్నారు. హిందువులను రెచ్చగొట్టే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. మాధవీలత శాంతియుతంగా నిరసన తెలిపితే అరెస్టు చేయడం సరికాదన్నారు. వెంటనే మాధవీలతను విడుదల చేయాలన్నారు.

ఘనంగా అంబేడ్కర్ బౌద్ధ ధర్మ దీక్ష పరివర్తన దివస్



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దళిత బహుజన ఫ్రంట్ నాయకులు

కవాడిగూడ: అంబేడ్కర్ చూపిన మార్గంలో పయనించడమే దళిత బహుజన జాతులకు సాత్విక విముక్తి అని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ పేర్కొన్నారు. సోమవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ బౌద్ధ ధర్మ దీక్ష పరివర్తన దివస్ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కరుణ, ప్రేమ, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం మానవీయతే పునాదిగల బౌద్ధ ధర్మాన్ని అంబేడ్కర్ స్వీకరించిన దినంగా కార్యక్రమం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇటికాల గణేష్, సీహెచ్ రోజాలీల, కాసాని అశోక్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మధుసూదనాచారికి అభినందనలు



మధుసూదనాచారిని సన్మానిస్తున్న వేణుగోపాల్‌రావు, రఫీ, ఉమామహేశ్వర్, గరిధర్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ రాష్ట్ర శాసనమండలి ప్రతిపక్ష నేతగా ప్రమాణస్వీకారం చేసిన సిరికొండ మధుసూదనాచారిని సోమవారం తన కార్యాలయంలో సామాజికవేత్త నడిపల్లి వేణుగోపాల్‌రావు, రిటైర్డ్ ఇంజినీర్ మహ్మద్ రఫీ అహ్మద్‌ఖాన్, ఉమామహేశ్వర్ శాలువతో సన్మానించి అభినందనలు తెలిపారు. మరింతగా ప్రజా సేవలు కొనసాగించాలని వారు కోరారు.

భక్తితో కొలిస్తే అన్ని శుభాలే



అమ్మవారి నిమజ్జన ఊరేగింపులో భక్తులు

చిక్కడపల్లి: శ్రీ కట్టమైసమ్మను భక్తితో కొలిస్తే అన్ని శుభాలే జరుగుతాయని గబ్బర్‌సింగ్ నటుడు ప్రేమ్‌సాయి అన్నారు. సోమవారం రాత్రి చిక్కడపల్లిలోని శ్రీకట్టమైసమ్మ దేవాలయంలో ఆయన పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోరని శ్యామ్, సభ్యులు శివ, బృందం తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత ఊరేగింపు..



ముషీరాబాద్: గంగపుత్ర కాలనీలో ఓం గంగా భవానీ సోషల్ వెల్ఫేర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను సోమవారం నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా గంగపుత్రకాలనీ 44 బస్టాప్, పార్సిగుట్ట చౌరస్తా, రాంనగర్ చౌరస్తా మీదుగా హుసేన్‌సాగర్‌కు ప్రదర్శనగా తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అశోక్‌కుమార్, కె.బాబురావు, గోవింద్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జైభవాని: అంబర్‌పేట జై భవానీ యూత్ అసోసియేషన్ అమ్మవారి ఊరేగింపులో యువత